విద్యార్థులకూ ఫేస్ అటెండెన్స్: మంత్రి బంగారప్ప

బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రానున్న విద్యా సంవత్సరం నుంచి ఫేస్ రికగ్నీషన్ అటెండెన్స్‌ను అమలు చేస్తామని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప తెలిపారు. సోమవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకమైన మార్పులు తెస్తామన్నారు. అటెండెన్స్ నుంచి తప్పించుకోకుండా చర్యలు తీసుకోవాలనే ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్‌ను తీసుకురాదలిచామన్నారు. విద్యార్థులను తప్పనిసరిగా బడికి పంపాలన్నారు.



అన్నభాగ్యం..!



- 'అన్నభాగ్య'తో కరువుతీరా బియ్యం
- ఈ నెల నుంచి ఒక్కొక్కరికి 10 కేజీలు
- ఫిబ్రవరి, మార్చి నెలలకు ఒకేసారి విడుదల
- నలుగురు ఉంటే బస్తా దాకా...
- లబ్ధిదారుల్లో హర్షం

బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ లబ్దిదారుల్లో హర్షం వెల్లువెత్తుతోంది. ఎన్నికల్లో హామీ మేరకు ఈ నెల నుంచి ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం సరఫరా ప్రారంభించింది. పథకం గత నెల నుంచే ప్రారంభించడంతో గతనెల 5 కేజీలతో కలిపి ఈ నెల మొత్తం 15 కేజీలు సరఫరా చేస్తున్నారు. పేదలు ఎవరూ ఆకలితో అలమటించరాదని రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ప్రారంభించారు. ఆ తర్వాత వివిధ రాష్ట్రాలు పలు పేర్లతో బీపీఎల్ కార్డుదారులకు బియ్యం ఇచ్చే పథకాన్ని కొనసాగిస్తున్నారు. ఇలా రాష్ట్రంలో కొన్నేళ్లుగా 'అన్నభాగ్య' పేరుతో ఒక వ్యక్తికి నెలకు 5కేజీల బియ్యం ఉచితంగా అందిస్తున్నారు. కొవిడ్ కాలం నుంచి కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా బీపీఎల్ కార్డుదారులందరికీ ఉచితంగా 5కేజీల బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారు. అంతకు ముందు కొన్ని నిత్యావసరాలు కేంద్రం విడుదల చేసేది. కొవిడ్ ముగిసినా ఉచిత బియ్యం మాత్రం నిరాటంకంగా పంపిణీ చేస్తున్నారు.

2 నెలల బియ్యం ఒకేసారి

రాష్ట్రంలో 'అన్నభాగ్య' గ్యారెంటీ పథకం ద్వారా బీపీఎల్ కార్డుదారులకు ఫిబ్రవరి, మార్చి నెలకు సంబంధించి ఒకేసారి బియ్యం విడుదల చేయడంతో లబ్దిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. హామీలు ఇచ్చామని, అవసరానికి కంటే ఎక్కువ బియ్యం ఇంటికి తీసుకొచ్చి ఏం చేయాలనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం ప్రతి కార్డుదారుడికి బియ్యం ఇచ్చారు. ఇలా ఒకేసారి రెండు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ చేయడంతో కొందరి ఇళ్లల్లో బస్తాలకొద్దీ బియ్యం చేరినట్టయ్యింది. ఐదుగురు సభ్యులు ఉన్న బీపీఎల్ కార్డుదారులకు ఫిబ్రవరి నెలకు సంబంధించి 5 కేజీలు, మార్చి నెలకు సంబంధించి 10 కేజీలు ఇచ్చారు. ఇలా ఐదుమంది ఉండే కుటుంబానికి ఏకంగా 75 కేజీల బియ్యం, ఆరుగురు ఉండే కుటుంబానికి 90 కేజీల బియ్యం విడుదలైంది. ఫిబ్రవరి దాకా కొనసాగిన నగదు బదిలీ రద్దు చేశారు.



బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న పౌరసరఫరాల శాఖ మంత్రి రామలింగారెడ్డి (ఫైల్)

హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వం

2023 శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా 5కేజీల బియ్యం ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. కేంద్రం ఇచ్చే 5 కేజీలకు అదనంగా రాష్ట్రం 5కేజీలు ఇవ్వడం ద్వారా బీపీఎల్ కార్డు కల్గిన ప్రతి వ్యక్తికి 10కేజీల బియ్యం నెలకు అందే అవకాశం ఉండేది. అయితే కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి అన్నభాగ్య పథకానికి బియ్యం విడుదల చేసేందుకు ససేమిరా అంది. ఫుడ్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) రాష్ట్రం కోరినంత బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేసింది. తొలుత రాష్ట్రప్రభుత్వం రాసిన లేఖకు స్పందించి బియ్యం సరఫరాకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్రప్రభుత్వాన్ని కోరి 'అన్నభాగ్య' పథకాన్ని ప్రకటించలేదు కదా... అంటూ మెలిక పెట్టారు. దీంతో రాష్ట్రప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 5కేజీల బియ్యం సకాలంలో ఇవ్వడం సాధ్యం కాలేదు. దేశమంతటా గత ఏడాది తీవ్రమైన కరువు నెలకొనడంతో వరి సాగు సాధ్యం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరపున బియ్యం విడుదల కోసం కేంద్రంతో తీవ్రమైన కసరత్తు జరిపింది. ప్రత్యామ్నాయంగా వివిధ రాష్ట్రాలనుంచి కొనుగోలుకు ప్రయత్నించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో బియ్యం కొనుగోలుకు ప్రయత్నించారు. భారీ స్థాయిలో బియ్యం అవసరం కావడంతో సమకూర్చుకోవడం సాధ్యం కాలేదు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బియ్యం సరఫరాకు అంగీకరించింది. కానీ రవాణా ఖర్చులు భరించలేని స్థాయిలో ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం వెనుకడుగు వేసింది. ఇచ్చిన హామీకి అనుగుణంగా మార్కెట్‌లో కేజీ బియ్యం రూ.34 కాగా ప్రతి బీపీఎల్ కార్డుదారుడికి 170 రూపాయలు చొప్పున నగదు బదిలీ చేశారు.

ఈ ఏడాది పుష్కలంగా బియ్యం

2024 సంవత్సరంలో ఖరీఫ్ పంటకాలంలోనే భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని అన్ని జలాశయాలు జూలై నాటికి నిండాయి. ఆ తర్వాత వరుసగా నాలుగు నెలలు వర్షాలు కురరవడంతో ఏమాత్రం నీటిమట్టం తగ్గలేదు. ఈ ప్రభావంతో ప్రాజెక్టుల నుంచి చెరువులకు నీరు మళ్లించారు. నేరుగా ప్రాజెక్టు కాలువల నుంచి పొలాలకు నీరు సమకూర్చారు. ఇలా ఖరీఫ్‌తోపాటు రబీ కాలంలోనూ పంటలు పుష్కలంగా పండా యి. పైగా ఫుడ్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కూడా అవసరమైనంత బియ్యం సమకూర్చేందుకు అంగీకారం వ్యక్తం చేసింది.

6 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ

రాష్ట్రవ్యాప్తంగా బీపీఎల్, అంత్యోదయతో కలిపి 1.28 కోట్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 4.43 కోట్ల మంది లబ్ధిదారులు న్నారు. ఒక్కొక్కరికి 5 కేజీల బియ్యం పంపిణీ చేసే సమయంలో 2.17 లక్షల మెట్రిక్ టన్నులు అవసరంగా ఉండేది. ప్రస్తుతం ఫిబ్రవరి కోటా 5 కేజీలు, మార్చి నెలకు 10 కేజీలు మొత్తం 15 కేజీలు బియ్యం పంపిణీ చేస్తున్నందున మొత్తంగా 6.51 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమైంది. ఏప్రిల్ నుంచి ప్రతి కార్డుదారుడికి 10 కేజీల బియ్యం పంపిణీ చేస్తున్నందున 4.34 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరంగా ఉంది. పుష్కలంగా బియ్యం ఇంటికి చేరుతుండంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

ఐదు మహానగర పాలికెలకు ఏడాదిలోగా ఎన్నికలు

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సంగ్రేశి



బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మహానగర పాలికె ఎన్నికల విషయంలో జాప్యం చేసినా ఏడాదిలోగా ఎన్నికలు జరిపి తీరుతామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జీఎస్ సంగ్రేశి తెలిపారు. మైసూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రిజర్వేషన్ల జాబితా ఇవ్వకపోయినా హైకోర్టు నుంచి పాత రిజర్వేషన్లకు అనుగుణంగా ఎన్నికలు జరుపుతామన్నారు. 2025 ముగింపులోగా మైసూరు, శివమొగ్గ, దావణగెరె, తుమకూరు, మంగళూరు, మహానగర పాలికెలకు ఎన్నికలు జరుపుతామన్నారు. రాష్ట్రంలో కొన్నేళ్లుగా మహానగర పాలికెలకు ఎన్నికలకు జరగలేదన్నారు. రాష్ట్రప్రభుత్వం రిజర్వేషన్ జాబితా ఇవ్వకపోవమే జాప్యానికి ముఖ్య కారణమన్నారు. ఈ ఏడాది అయినా రిజర్వేషన్ జాబితా ఇస్తారని భావిస్తున్నామన్నారు. ఇప్పటికే మహానగర పాలికెలలో ఎన్నికలు జరిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ జాబితా ఇస్తే వాటికి అనుగుణంగా జరుపుతామని, లేని పక్షంలో హైకోర్టును ఆశ్రయించి పాత రిజర్వేషన్‌ల ద్వారా కొనసాగిస్తామన్నారు.

వరి అభివృద్ధి బోర్డు ఏదీ..?

- రాష్ట్రంలో విస్తారంగా సాగు
- ఏడాదిలో రాష్ట్రంలో 46.90 లక్షల టన్నుల ఉత్పత్తి
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

బళ్లారి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు విస్తారంగా పండించే పంటల్లో వరి ముఖ్యమైనది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 15 జిల్లాలో వరిసాగు చేస్తున్నారు. కొన్ని జిల్లాలో కొబ్బరి, అరటి, వక్క, కాఫీ. పంటలు పండిస్తున్నారు. అధిక భాగం వరే సాగు చేస్తున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. 2023-24 ఏడాది 46-90 లక్షల టన్నుల వరి పండిందని వ్యవసాయ శాఖ పేర్కొంది. తుంగభద్ర డ్యాం నుంచి అందే జలాలతో ఉత్తర కర్ణాటకలోని రాయచూరు, బళ్లారి, కొప్పళ, యాదగిరి, జిల్లాలు వరి పండించే స్థానంలో అగ్రగామిగా ఉన్నాయి. దావణగెరె, మైసూరు, మాండ్య, జిల్లాల్లో కూడా వరి బాగా పండిస్తున్నారు. రాయచూరు జిల్లాలో 11.40 లక్షల టన్నుల వరి 2024 ఏడాది ఉత్పత్తి చేసి రాష్ట్రంలో ముందంజలో నిలిచింది. బళ్లారి జిల్లాలో 5.18 లక్షల టన్నులు యాదగిరిలో 4.72 లక్షల టన్నులు, కొప్పళలో 4.22 లక్షల టన్నులు, వరి దాన్యం పండింది.

రాష్ట్రంలో వరి బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర రైతు సంఘాలు, రైతులు ప్రభుత్వాన్ని అనేకసార్లు డిమాండ్ చేశాయి. 2025 మార్చి నెలలో జరిగిన విధానసభ సమావేశాల్లో కూడా సింధనూరు ఎమ్మెల్యే బసనగౌడ బాదర్లి వరి బోర్డుపై సభలో ప్రశ్నించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చెలువ నారాయణస్వామి బదులిస్తూ రాష్ట్రంలో అనేక వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, అలాగే పరిశోధన కేంద్రాలు ఉన్నాయని ఇవి వరి పంట సాగుకు సాంకేతికంగా సూచనలు సలహాలు ఇస్తున్నాయని సమాధానమిచ్చారు. అయితే అవి పెద్దగా రైతులకు అందుబాటులోకి రావడం లేదని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. చాలా వరకూ వరి దిగుబడి తగ్గుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మారుతున్న కాలానికి, పెరుగుతున్న వివిధ రోగాలకు పంట దిగుబడి తగ్గుతుందని రైతులు పేర్కొన్నారు. బోర్డు ఏర్పాటు చేస్తే సరైన సూచనలు అందుతాయన్నారు.



వరి కంకులను వడుపుకుంటను రైతులు

బోర్డు ఏర్పాటుతోనే రైతులకు మెలకువలు

: మాధవ రెడ్డి, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు



రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వరి పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. రైతులకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చేవారు లేక ఏడాదికేడాది దిగుబడి తగ్గిపోతుంది. వరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. కాఫీ, నూనెగింజలు, యాలకులు, కొబ్బరి, వక్కల పంట సాగుల అభివృద్ధి బోర్డు పనిచేస్తున్నాయి. ఎందరికో అన్నం పెట్టే వరి సాగు అభివృద్ధిపై ప్రభుత్వం కృషి చేయాలి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.48 (మంగళవారం సాయంత్రం)

సెహరీ : 5.08 (బుధవారం ఉదయం)

ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు రిటైర్డ్ అధ్యాపకుల మృతి



కేబీ మోహన్ (ఫైల్)



లక్ష్మీనారాయణ (ఫైల్)

బంగారపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాల వద్ద ఓ ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు రిటైర్డ్ అధ్యాపకులు మృతి చెందారు. కన్నడ రిటైర్డ్ అధ్యాపకుడు కేబీ మోహన్ (64), కెమిస్ట్రీ లెక్చరర్ లక్ష్మీనారాయణ (62) మరణించారు. ఆదివారం సాయంత్రం యథాప్రకారం వాకింగ్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని బెంగళూరు మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక ఇద్దరూ మృతిచెందారు. వాహనదారుడు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడమే ప్రమాదానికి కారణం. ప్రమాదం అనంతరం అతను పారిపోయాడు. ఘటనపై బంగారపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

ఆసుపత్రే ఆవాసం..!

- అంబులెన్స్‌లో తెచ్చారు.. వదిలేశారు..
- 9 నెలలుగా హాస్పిటల్‌లోనే వృద్ధుడు
- సిబ్బందే ఆయన బంధువులు
- కొప్పళ జిల్లా ఆసుపత్రిలో అందరూ ఉన్న అనాథ



తొమ్మిది నెలలుగా మంచానికి పరిమితమైన వృద్ధుడు

బళ్లారి గాంధీనగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆ వృద్ధుడికి ఆసుపత్రే నివాసంగా మారింది..సిబ్బందే బంధువులుగా మారారు. ఆరుగురు సంతానం..అయినా పట్టించుకునే నాథుడే లేక దిక్కు లేనివాడిగా మారాడు. తొమ్మిది నెలల క్రితం అనారోగ్యంగా ఉన్న వృద్ధుడిని ఆసుపత్రిలో చేర్పించి వెళ్లిన వారు ఇంత వరకు తిరిగి చూడలేదు... అతడికి పిల్లలు, బంధువులు ఉన్నా ఇంటికి తీసుకెళ్లడానికి ఇంతవరకు ఎవరూ రాలేదని ఆసుపత్రి సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో ఆసుపత్రి సిబ్బందే అన్ని భోజనం మొదలుకుని... సపర్యలు చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. కన్నవారు మంచం పడితేనే పట్టించుకోని నేటి రోజుల్లో గుర్తు తెలియని ఓ వృద్ధుడికి బాసటగా నిలుస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

వృద్ధాప్యంలో పిల్లలు వారి తల్లితండ్రులను బాధ్యతగా చూసుకోవడం కనీస దర్మం. అయితే ప్రస్తుత రోజుల్లో చాలా మంది కని పెంచిన తల్లితండ్రులను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి... తరువాత అటువైపు చూడక పోవడం తరచూ వింటున్నాం. కొప్పళ జిల్లా ఆసుపత్రిలో ఒంటిపైన సరిగా బట్టలు లేక... లేని నిలబడి నడవలేని స్థితిలో... పడుకున్న చోటనే... మలమూత్ర విసర్జన చేసుకునే స్థితిలో ఉన్నా... కొప్పళ జిల్లా ఆసుపత్రి సిబ్బంది ఏమాత్రం అసహ్యించుకోకుండా భోజనం, చికిత్స అందిస్తున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా తొమ్మిది నెలలుగా బెడ్డుపైనే లేవలేని స్థితిలో ఉన్నాడు. ఆసుపత్రి రికార్డుల ప్రకారం వృద్ధుడి పేరు రామాంజనేయులుగా తెలిసింది. విజయనగర జిల్లా హొసపేట నివాసి అయిన ఈ వృద్ధుడి వయస్సు 70 సంవత్సరాలు. ఇనుప పనిముట్లు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్న రామాంజనేయులును గత ఏడాది 2024, మే నెలలో 108వాహనంలో తీసుకొచ్చి ఆస్పత్రిలో వదిలిన బంధువులు నాటి నుంచి కన్నెత్తి చూడలేదు. అప్పటి జిల్లా ఆసుపత్రి మూడవ అంతుస్తులో ఓ వార్డులో ఏకాకిగా బెడ్డుపైనే చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఆయనకు ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు లేవు... అయితే నడవలేని స్థితిలో ఉండడంతో ఆసుపత్రి సిబ్బంది కూడా ఆయనను బయటకు పంపలేక పోతున్నారు. రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు తన భార్య గత కొన్నేళ్ళ క్రితమే విడిచి వెళ్లింది, ఆయనకు ఆరుగురు సంతానం. అందులో నలుగురు మృతి చెందగా మిగిలిన ఇద్దరు ఎక్కడ ఉన్నారో తెలియదు. తన ఈ దుస్థితికి తన తమ్ముడే కారణమని, తన కున్న ఆస్తిని తమ్ముడు ఆయన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని తనను బయటకు పంపాడని ఆసుపత్రి సిబ్బందితో మొర పెట్టుకున్నాడు. ఈ విషయంలో జిల్లా పాలనా మండలి చొరవ తీసుకుని వృద్ధుడికి న్యాయం జరిగేలా చూడాలని, అవసాన దశలో ఉన్న వృద్ధుడిని అయిన వారి చెంతకు చేర్చాలని పలువురు కోరుతున్నారు.

వర్గీకరణపై వారం రోజుల్లో మధ్యంతర నివేదిక

బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై వారం రోజుల్లో మధ్యంతర నివేదికను ఇవ్వనున్నట్లు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీ తెలిపింది. సీఎం సిద్దరామయ్య సోమవారం వర్గీకరణకు సంబంధించి కీలకమైన సమావేశం జరిపారు. అనంతరం హోం మంత్రి పరమేశ్వర్ మీడియాతో మాట్లాడారు. జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీ వారం రోజుల్లో మధ్యంతర నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపిందన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రితో చర్చించి అమలుకు నిర్ణయం తీసుకుంటామన్నారు. వర్గీకరణ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వర్గీకరణ అమలు చేస్తామని ఎన్నికల హామీల్లో ప్రకటించామన్నారు. మంత్రులు మహదేవప్ప, మునియప్ప, శివరాజ్ తంగడిగ తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో సీఎం సిద్దరామయ్య, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్‌దాస్ తదితరులు



జిల్లాలవారీగా సామూహిక సీమంతాలు

- స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గర్భిణీలందరికీ 2026 మార్చి నుంచి జిల్లాలవారీగా సామూహిక సీమంతం నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ వెల్లడించారు. బెళగావి జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, స్త్రీశిశుసంక్షేమ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌ల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం 3వేలమందికి సామూహిక సీమంతం నిర్వహించి మంత్రి మాట్లాడారు. సీమంతం అనేది మన దేశ సంస్కృతిలో భాగంగా ఉందన్నారు. గర్భిణుల ఆరోగ్యమే ప్రధానమన్నారు. గర్భిణీ ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యకరమైన శిశువు సాధ్యమన్నారు. ఈ సందర్భంగా వందమంది దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే వీల్‌చెయిర్‌లు, ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. స్త్రీశక్తి సంఘాల ప్రాంతీయ వస్తు ప్రదర్శన, స్టాల్స్‌ను ప్రారంభించారు.

గర్భిణులను ఆశీర్వదిస్తున్న మంత్రి హెబ్బాళ్కర్

నంది కొండలకు రోప్‌వే ప్రమాదకరం

- పర్యావరణ నిపుణుల హెచ్చరిక

7

రోడ్డు భద్రతపై అవగాహనకు హాఫ్ మారథాన్



కర్రల సాయంతో విద్యుత్ తీగలను ఎత్తి ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతులు

చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

సేద్యం చేయాలంటే అవస్థలు
విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం
రైతులకు అవస్థలు

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు అవస్థలు పడుతున్నారు. విడపనకల్లు మండలంలోని గడేకల్లు, కడదరబెంచి గ్రామాల మధ్యలోని పొలాల్లో విద్యుత్ తీగలు నేలకు తాకే ఎత్తులో ఉన్నాయని, సేద్యాలు చేయటానికి ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడేకల్లు గ్రామానికి చెందిన రైతులు పొలాల్లో దుక్కి చేసుకోవటానికి ఇబ్బంది పడుతున్నారు. అంజినయ్య, భీమలింగప్ప పొలాల్లో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. దుక్కి దున్నుతున్న సమయంలో ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలే ప్రమాదం ఉండడంతో రైతులు ముందు జాగ్రత్తగా కర్రల సాయంతో వాటిని పైకి ఎత్తి పట్టుకుంటున్నారు. పొలంలో సేద్యం చేయాలంటే ప్రస్తుతం ముగ్గురు కూలీలు అవసరమవుతారని రైతులు అంటున్నారు. విద్యుత్ తీగలను కర్రలతో పైకి ఎత్తిపట్టుకోవటానికి ఇద్దరు, ట్రాక్టర్ వెనుక ఒకరు ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. వెంటనే వేలాడుతున్న విద్యుత్ తీగలను మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విడపనకల్లు



గడేకల్లు వద్ద పొలంలో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

హంద్రీనీవాకు 29 టీఎంసీలు



హంద్రీనీవా కాలువలో ఆగిపోయిన నీటి ప్రవాహం

గుంతకల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాలో గత మూడేళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం అధిక మోతాదులో నీటి ఎత్తిపోతలు జరిగాయి. వైసీపీ హయాంలో 2021-22 సీజన్ మినహా కనీసం 25 టీఎంసీల మార్కును దాటి నీటిని పారించలేకపోయారు. 2024-25 సీజన్‌లో గత వారం హంద్రీనీవాలో ఎత్తిపోతలు నిలిపేశారు. మొత్తంపై 28.9 టీఎంసీల నీటిని పంపుచేశారు. ప్రభుత్వం అనుకున్నట్టుగానే శ్రీశైలం డ్యాంలో ఇంకా తగినన్ని నీటి నిల్వలు ఉండగానే హంద్రీనీవాకు ఎత్తిపోతలను నిలిపివేశారు. దీంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన ఏడేళ్లలో తొలిసారిగా హంద్రీనీవాకు ఆ ప్రాజెక్టు నుంచి ప్రత్యామ్నాయంగా నీటిని తోడుకునే అవసరం లేకుండాపోయింది. హెచ్ఎన్ఎస్ఎస్‌లో 220 రోజులపాటు ఏకధాటిగా నీటిని ఎత్తిపోసినా ఈ సంవత్సరం 40 టీఎంసీల మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోలేకపోయారు.

శ్రీశైలం డ్యాంలో నీరున్నా..

సాధారణంగా శ్రీశైలం డ్యాంలో 835 అడుగుల స్థాయి వరకూ మల్యాల పంప్‌హౌస్ వద్ద హంద్రీనీవాలోకి నీటిని ఎత్తిపొయ్యడానికి సాధ్యపడుతుంది. 2017లో కేసీ కెనాల్ కోసం నిర్మించిన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా 814 అడుగుల స్థాయి వరకూ నీటిని తోడుకోవచ్చు. ఈ కారణంగా మల్యాల పంపులు ఆగిన తర్వాత కూడా ముచ్చుమర్రి పంపుల ద్వారా కూడా హంద్రీనీవాకు నీటిని ఇవ్వడానికి ఆ ప్రాజెక్టును రూపకల్పన చేసి 2017లో చంద్రబాబు నాయుడు జలహారతి కార్యక్రమం కింద ప్రారంభించారు. అప్పటి నుంచి డ్యాంలో నీటి నిల్వలు తగ్గిపోయి మల్యాల పంపుహౌస్ పనిచేయకపోతే, ప్రత్యామ్నాయంగా ముచ్చుమర్రి పథకం ద్వారా హంద్రీనీవాకు తక్కువ మోతాదులో నీటిని పారించేవారు. అలా గడచిన ఏడేళ్లు ముచ్చుమర్రి పథకం నుంచి హంద్రీనీవాకు నీటిని ఇచ్చారు. కానీ, ఈ సంవత్సరం డ్యాంలో తగినన్ని నీటి నిల్వలను ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పంటలన్నింటికీ తుది తడులు పూర్తయిన వెంటనే హంద్రీనీవాకు ఎత్తిపోతలను నిలిపివేసింది. ప్రస్తుతం 837.4 అడుగుల నీటి నిల్వ ఉంది. ఇదివరకైతే 814 అడుగుల స్థాయి వరకూ నీటి ఎత్తిపోతలు జరిగేవి. దీర్ఘకాలిక పంటలైన కంది, మిర్చి పంటలు కూడా పూర్తికావడంతో ఇక సాగునీరు అక్కర్లేదని భావించి రైతుల సమ్మతితో హంద్రీనీవాకు పంపింగ్‌ను నిలిపివేశారు.

మూడేళ్లలో గరిష్ఠం

2024-25 సీజన్‌కు సంబంధించి గతవారం హంద్రీనీవా నుంచి జిల్లాకు నీటి ప్రవాహం నిలిచిపోయింది. మొత్తంపై 28.9 టీఎంసీల నీరు హంద్రీనీవాలో పారించారు. గడచిన మూడు సీజన్లతో పోలిస్తే ఎక్కువ స్థాయిలో పారించినట్లయింది. 2021-22 సీజన్‌లో హంద్రీనీవాలో 25.56 టీఎంసీలు నీరు పారగా, 2022-23 సంవత్సరంలో 23.7 టీఎంసీలు, 2023-24 సంవత్సరంలో 21.2 టీఎంసీలు మాత్రమే పంపు చేయగలిగారు. ఈ లెక్కన 2020-21 సీజన్‌తో పోలిస్తే తర్వాతి సంవత్సరంలో 14.5 టీఎంసీలు, 2021-22 సంవత్సరంలో పోలిస్తే తదుపరి సంవత్సరం దాదాపు 2 టీఎంసీలు, 2022-23తో పోలిస్తే 2023-24 సీజన్‌లో హంద్రీనీవాకు రెండు టీఎంసీల నీటి కోత ఏర్పడింది. ఈ సంవత్సరం గత మూడేళ్ల రికార్డులు అధిగమించి 28.9 టీఎంసీలను నీటిని పారించారు. ఇందులో జిల్లాలోకి 24.5 టీఎంసీల నీరు వచ్చి ఎగువకు పారగా, కర్నూలు జిల్లాకు 4.4 టీఎంసీలు లభించాయి. ఇదిలా ఉండగా, హంద్రీనీవాకు నీరు నిలిచిన వెంటనే వెడల్పు పనులు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్న కారణంగా ఏప్రిల్ వరకూ నీటిని పారించే అవకాశం ఉన్నా ఎత్తిపోతలకు బ్రేక్ వేసినట్టు సమాచారం.

మండేకాలం.. జాగ్రత్త

వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం

ధర్మవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. వాతావరణం అగ్ని సెగలా మారింది. ఇలాంటి స్థితిలో అగ్ని ప్రమాదాలు జరిగితే..! క్షణాల్లో సర్వం బుగ్గి అవుతుంది. ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. అందుకే వేసవిలో ప్రజలు అగ్ని విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. ఎంతలేదనుకున్నా ఎండాకాలంలో ఎక్కడో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు పొగరాయుళ్లు బీడీ, సిగరెట్లను ఆర్పకుండా నిర్లక్ష్యంగా పారేయడం వల్ల కూడా కొన్ని ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. నిప్పుపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక కేంద్రం సిబ్బంది హెచ్చరిస్తున్నారు. ధర్మవరం అగ్నిమాపక కేంద్రంలో 15 మంది సిబ్బంది, ముగ్గురు హోంగార్డులు, ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలో ధర్మవరం, ధర్మవరం రూరల్, తాడిమర్రి, బత్తలపల్లి, సీకేపల్లి మండలాలు ఉన్నాయి. ఏడాదికాలంలో దాదాపు 60 అగ్నిప్రమాదాలు జరిగాయి. దాదాపు రూ.కోటికిపైగా నష్టం వాటిల్లినట్టు అధికారులు చెబుతున్నారు. ఐదు మండలాలకు ఒకే ఫైరింజన్ ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ఆకతాయిలు చెత్తకు నిప్పుపెట్టడంతో చెలరేగిన మంటలు

తరచూ గడ్డివాముల దగ్ధం

గ్రామాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న గడ్డివాములు ఎండాకాలంలో తరచూ అగ్ని ప్రమాదాలకు గురవుతుంటాయి. గడ్డివాముకు గడ్డివాముకు కనీస దూరం 10మీటర్లు ఉండేలా ఏర్పాటు చేసుకుంటే నష్టం తగ్గే అవకాశం ఉందని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. కరెంటు తీగల కింద గడ్డివామును వేయకూడదు. పచ్చిగడ్డి, ఎండు గడ్డి కలిపి వామి వేయకూడదు. దీని వల్ల ఎండ వేడిమికి మంటలు చెలరేగే అవకాశాలు ఉంటాయి. గడ్డిని పూర్తిగా ఎండబెట్టిన తరువాతే వామి వేసుకోవాలి. గడ్డివాముల దగ్గర బీడీ, సిగరెట్లు వంటివి కాల్చరాదు. పొలాల్లో పంటలు చేతికొచ్చిన తరువాత మిగిలిన చెత్తకు రైతులు మంటలు పెట్టడం సర్వసాధారణం. అయితే ఆ మంటలు పూర్తిగా ఆరిపోయే వరకు అక్కడే ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.

ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి



గ్యాస్ సిలిండర్లు

- ప్రజలు ఎండాకాలంలో పెట్రోల్ బంకుల దగ్గర సెల్‌ఫోన్‌ల ఓటీ మాట్లాడటం చాలా ప్రమాదకరం. పెట్రోల్ బంకు యాజమాన్యం ఇసుక, మంటలను అదుపుచేసే డీసీపీ వంటి అన్ని రకాల సిలిండర్లను అందుబాటులో ఉంచుకోవాలి.
- కరెంటు ఓల్టేజీలో హెచ్చుతగ్గుల వల్ల ఇళ్లలోనే కాకుండా దుకాణం, పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎండకాలంలో ఎక్కువ కరెంటు వినియోగం వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇళ్లు, దుకాణాల్లో తెగిపోయిన పాత వైర్లు, పాత బడిన స్విచ్‌లు, బోర్డులంటే వెంటనే వాటిని మార్చేయాలి. లేకపోతే వీటి వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.
- రాత్రి వేళ వంట పూర్తి అయిన తర్వాత తప్పకుండా గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. సిలిండర్‌కు ఐఎస్ఐ ముద్ర కల్గిన పైపును మాత్రమే వినియోగించాలి. రెండు రోజులు ఊరికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన తరువాత కిటికి, తలుపులు పూర్తిగా తెరిచిన ఐదు నిమిషాల తర్వాతే కరెంటు స్విచ్‌లను ఉపయోగించాలి. సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయితే భయపడకుండా దుప్పటి లేక ఏదో బట్ట సాయంతో సిలిండర్‌కు చుట్టి మంటను నివారించే ప్రయత్నం చేయాలి.



అగ్ని మాపక వాహనం

సహ పోరు బ్యాంకు..!

ఏడీసీసీకి నలుగురు సీఈఓలు?
వర్గాలుగా విడిపోయిన ఉద్యోగులు

స్తంభించిన కార్యకలాపాలు

ఇష్టారీతిన వ్యవహరిస్తున్న వైనం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కరువు రైతును ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన సహకార బ్యాంకు వర్గపోరుకు నిలయంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనంతపురం జిల్లా కేంద్ర సహకార (ఏడీసీసీ) బ్యాంకుకు నలుగురు సీఈఓలుగా వ్యవహరిస్తున్నారు. నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా.. ఇది ముమ్మాటికీ వాస్తవమే. ప్రస్తుత సీఈఓతోపాటు గతంలో అదే హోదాలో పనిచేసిన ముగ్గురు ఇక్కడే పనిచేస్తున్నారు. వారు వర్గాలుగా విడిపోయి, పోరు సాగిస్తున్నారన్న చర్చ బ్యాంకు వర్గాల్లో వినిపిస్తోంది. గతంలో సీఈఓలుగా పనిచేసిన అధికారులు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లకుండా ఇక్కడే మాటు వేసుకుని కూర్చున్నారు. దీంతో బ్యాంకులో ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించి, తమ ఉనికి కాపాడుకుంటున్నారని తెలుస్తోంది. బ్యాంకులో కింది భాగాన ఐటీ పేరుతో ఓ అధికారి, మొదటి అంతస్తులో రుణాల పేరుతో మరొకరు, రెండో అంతస్తులో అడ్మిన్ పేరుతో ఇంకొకరు ఇలా ముగ్గురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సీఈఓ మొదటి అంతస్తులోని ప్రధాన శాఖలో ఉన్నారు. వారి తీరుతో బ్యాంకు తిరోగమనంలోకి వెళ్తోంది. గత ఐదేళ్లలో బ్యాంకును పూర్తిగా నిర్వీర్యం చేశారు. ప్రధాన కార్యాలయంలో మరో ఇద్దరు అధికారులు పదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారు. దీంతో బ్యాంకు కార్యకలాపాలన్నీ వారి కనుసన్నల్లోనే సాగుతున్నాయన్న చర్చ వినిపిస్తోంది. స్టేషనరీ, ఫర్నీచర్ ఇతర సామగ్రి కొనుగోలు, క్యాలెండర్, డైరీల తయారీ ఇలా ప్రతి అంశంలోనూ కమీషన్లకు కక్కుర్తి పడి బ్యాంకుపై తీవ్ర ఆర్థికభారం మోపుతున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

విచారణాధికారి మార్పు

ఏడీసీసీ బ్యాంకు ఆత్మకూరు బ్రాంచ్ పరిధిలో 2015-16లో ఆరుగురు రైతులకు రూ.30 లక్షల వరకు రుణాలు ఇచ్చారు. వారివి అసైన్డ్ పట్టాలని తేల్చారు. తొమ్మిదేళ్లకుగాను మొత్తం వడ్డీతో కలిపి రూ.50 లక్షల వరకు చేరింది. ఈ రుణాల చెల్లింపులో ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై విచారణ బాధ్యతను జిల్లా కేంద్రంలోని ఓ అధికారికి అప్పగించారు. విచారణ నివేదిక అందరినీ విస్తుగొలిపింది. విచారణకు ఎవరూ సహకరించడం లేదని నివేదిక సమర్పించినట్లు సమాచారం. విచారణాధికారి, అక్రమాల్లో పాలుపంచుకున్న అధికారి మధ్య సయోధ్య కుదరడంతోనే ఇలా నివేదిక ఇచ్చారనే విమర్శలు వినవస్తున్నాయి. తర్వాత జిల్లా సహాయ సహకార శాఖాధికారిని విచారణాధికారిగా నియమించారు. ఈయన ఏం చేస్తారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కిందిభాగంలోని ఐటీ విభాగం



చుట్టపు చూపుగా పర్సన్ ఇన్‌చార్జి

ఏడీసీసీ బ్యాంకు పాలకవర్గ పదవీకాలం ముగియడంతో జిల్లా జాయింట్ కలెక్టర్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. 9 నెలలుగా పర్సన్ ఇన్‌చార్జి కొనసాగుతున్నారు. బ్యాంకులో అంతులేని అవినీతి, అక్రమాలు జరుగుతున్నా.. పర్సన్ ఇన్‌చార్జి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. సమావేశాల్లో రైతు రుణాల వడ్డీ రాయితీలో అక్రమాలు జరిగాయంటూ సహకార శాఖ అధికారులు ఆధారాలతో సమస్యను లేవనెత్తినా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. నలుగురు అధికారులు విడిపోయి ఉద్యోగుల మధ్య చీలికలు తీసుకువచ్చినా... వారి మధ్య సమన్వయం కుదర్చడంలోనూ పర్సన్ ఇన్‌చార్జి చొరవ చూపలేకపోయారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సమన్వయంతో పని చేయాలి

అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. బ్యాంకు, సొసైటీలు సంయుక్తంగా పురోగతి సాధనలో భాగస్వాములవ్వాలి. ఆత్మకూరు శాఖలో బోగస్ పట్టాలకు రుణాల ఆరోపణలపై మొదట విచారణ చేసిన నివేదిక సంతృప్తికరంగా లేదు. దీంతో డీఎల్‌సీఓను విచారణాధికారిగా నియమించారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.



- అరుణకుమారి, జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ)



రేపటి వరకూ అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం విద్య, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచర్ల సీనియారిటీ జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే...ఈ నెల 26వ తేదీలోగా చెప్పాలని అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పని చేసే టీచర్ల సీనియారిటీ జాబితాను టిస్, డీఎస్సీల వారీగా మార్కులు, మెరిట్ ఆధారంగా రూపొందించామన్నారు. సీనియారిటీ జాబితాను అనంతపురం డీఈఓ బ్లాగ్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే... ఈనెల 26లోగా ఆధారాలతో అనంతపురం శారదానగర్‌లోని జిల్లా సైన్స్ సెంటర్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. గడువు తీరిన తర్వాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించమని డీఈఓ స్పష్టం చేశారు.

సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ బదిలీ

అనంతపురం న్యూటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) అనంతపురం డివిజన్ సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో సుగంధ మొక్కల తయారీ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డెప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టెరిటోరియల్ డీఎఫ్ఓ విఘ్నేష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సోషల్ ఫారెస్ట్ ద్వారా నర్సరీల అబివృద్ధికి నిధులు విడుదల కాకపోయిన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిధులు సమకూర్చుకొని నర్సరీల అబివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టేలా గత వారంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి దిశ నిర్దేశం చేశారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి సిబ్బంది సైతం పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టారు. అయితే డీఎఫ్ఓ బదిలీతో ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకోనున్నా విఘ్నేష్ ఆ స్థాయిలో స్పందిస్తారా లేదా అన్నది తెలియాలంటే సిబ్బంది వేచి చూడాల్సిందే.

నాణ్యమైన సేవలే లక్ష్యం

- వేసవిలో ప్రణాళికాబద్ధంగా విద్యుత్ సరఫరా
- ఏ సమస్యకైనా 1912కు ఫిర్యాదు చేయండి
- విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్



ఇంటర్వ్యూ interview

అనంతపురంరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య ఎదురైనా ఏపీఎస్పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి.. ఎన్ని ఫీడర్ల ద్వారా వినియోగం జరుగుతోంది?

జవాబు: జిల్లా వ్యాప్తంగా గృహ కనెక్షన్లు 6.17 లక్షలు ఉన్నాయి. వీటితోపాటు కమర్షియల్, ఇండస్ట్రీస్, ప్రభుత్వ, వ్యవసాయ, ఇతర కనెక్షన్లు 2.72 లక్షలు ఉన్నాయి. వీటన్నింటికీ 707 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది.

ప్రశ్న: జిల్లాలో రోజువారి విద్యుత్ వినియోగం ఎంత ఉంటోంది..?

జవాబు: వేసవి కాలం ప్రారంభమైంది. రోజువారి వినియోగం బాగా పెరిగింది. జిల్లాకు 11.857 మిలియన్ యూనిట్లు కేటాయింపులు ఉన్నాయి. ప్రస్తుతం రోజు వారిగా 11.650 మిలియన్ యూనిట్లు వినియోగమవుతోంది. వచ్చే నెల నుంచి 13.5 మిలియన్ యూనిట్లు వినియోగం జరిగే అవకాశం ఉందని అంచనా వేశాం. అందుకు అనుగుణంగా సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: వ్యవసాయానికి ఏ విధంగా సరఫరా చేస్తున్నారు..?

జవాబు: జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కనెక్షన్లు 1.84 లక్షలు ఉన్నాయి. 491 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. నీటి సమస్యలేని 89 ఫీడర్లలో 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మిగిలిన 402 ఫీడర్లలో రైతుల విజ్ఞప్తి మేరకు రెండు విడతల్లో సరఫరా చేస్తున్నాం. పగటి వేళల్లో 5 గంటలు, రాత్రి వేళల్లో 4 గంటల సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

జవాబు: వేసవిలో ఓవర్‌లోడు కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఎక్కువగా తలెత్తే అవకాశం ఉంది. మరమ్మతులకు గురైన వెంటనే క్షేత్రస్థాయిలో లైన్‌మెన్, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ మార్చాల్సి ఉంటుంది. అధికారుల నుంచి స్పందన లేకపోతే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: విద్యుత్ సరఫరాలో అంతరాయాలను అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తుంటాయి. లోఓల్టేజీ, హైఓల్టేజీ వంటి సమస్యలు వస్తుంటాయి. సమస్య ఎక్కువగా ఉన్నప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. అవసరం మేరకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాం.

నేడే ఆంధ్రజ్యోతి లక్కీడ్రా

అనంతపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకుల కోసం కార్ అండ్ బైక్‌రేస్‌ను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా (అనంతపురం యూనిట్) స్థాయిలో విజేతల ఎంపిక కోసం మంగళవారం లక్కీడ్రా నిర్వహించనుంది. ఆంధ్రజ్యోతి అనంతపురం యూనిట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుంది. ముఖ్యఅతిథుల ద్వారా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతోపాటు వందమంది ప్రోత్సాహక బహుమతులకు విజేతలను ఎంపిక చేస్తారు. 2024 నవంబరు నుంచి 2025 ఫిబ్రవరి వరకు ప్రతినెలా మూడు చొప్పున నాలుగు నెలలకు 12కూపన్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించారు. ఒక్కొక్క నెల కూపన్లు ఒక సెట్టుగా నాలుగు నెలలకు నాలుగు సెట్ల కూపన్లు పాఠకులు ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో అందజేశారు. పాఠకులు పంపిన వేలాది కూపన్ల నుంచి మొదటి బహుమతి బైక్, ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి కలర్ టీవీ, వంద మందికి కన్సొలేషన్ బహుమతులు ఇస్తారు. అదేవిధంగా త్వరలో నిర్వహించే ఏపీ రాష్ట్ర స్థాయి లక్కీడ్రాలో బంపర్ బహుమతిగా కారు గెలుచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం 11 గంటలకు కక్కలపల్లి క్రాస్ సమీపంలోని అనంతపురం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో నిర్వహించే లక్కీడ్రాకు పాఠకులందరూ ఆహ్వానితులే.

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.82.64 లక్షలు




కదిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 15రోజులు బ్రహోత్సవాల సందర్భంగా రూ.82,64,892లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 12 గ్రా. బంగారం, 302 గ్రా. వెండి వచ్చిందన్నారు. 21 అమెరికన్ డాలర్లు, 20 కెనడా డాలర్లు, ఆస్ట్రేలియా 20 డాలర్లతోపాటు ఒమన్ కరెన్సీ 7 రియాలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారి ఎన్ ప్రసాద్, కెనరాబ్యాంక్ మేనేజర్ అనంతబాబు, పలువురు సిబ్బంది ఉన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

దువ్వూరి వేంకటరమణ శాస్త్రి (జయంతి)




సుప్రసిద్ధ సంస్కృతాంధ్ర పండితుడు, కళాప్రపూర్ణ గ్రహీత దువ్వూరి వెంకటరమణ శాస్త్రి 1897 మార్చి 25న తూర్పు గోదావరి జిల్లా మసకపల్లిలో జన్మించారు. వీరి పూర్వీకులు నెల్లూరు జిల్లాలోని దువ్వూరి ప్రాంత వాసులై క్రమేణా గోదావరి జిల్లాకు చేరారు. ఆరు దశాబ్దాల పాటు తెలుగు అధ్యాపకులుగా వ్యవహరించారు. చక్కటి దస్తూరి ఆయన ప్రత్యేకత. వ్యాకరణాన్ని సులభంగా బోధించేవారు. తెలుగు సాహిత్యం, ఉపాధ్యాయ ప్రముఖులపై స్వీయచరిత్రను రాయడం విశేషం. 1972లో కన్నుమూశారు.

నార్మన్ బోర్లాగ్ (జయంతి)



హరిత విప్లవ పితామహుడిగా పేరొందిన నోబెల్ శాంతి పురస్కార గ్రహీత నార్మన్ ఎర్నెస్ట్ బోర్లాగ్ 1914 మార్చి 25న అమెరికా దేశం అయోవాలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందిని ఆకలి బాధల నుంచి, పస్తులనుంచి రక్షించిన వ్యక్తి. తొలుత చీడ పీడలనుంచి తట్టుకునేలా గోధుమ వంగడాలను సృష్టించారు. 1960 ప్రాంతంలో ఇండియా, పాకిస్థాన్ దేశాలకు వంగడాలను పరిచయం చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 18.7 కోట్ల ఎకరాలలో ఆయన వంగడాలను వాడుతున్నారు. 2006లో ఆయనపై 'ది మ్యాన్ హూ ఫెడ్ ది వరల్డ్' అనే పుస్తకం వచ్చింది. 2009 సెప్టెంబరు 12న కన్నుమూశారు.

ఎస్ఎం పండిత్ (జయంతి)



ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ సాంబానంద్ మోహన్ (ఎస్ఎం) పండిత్ కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలో 1916 మార్చి 25న జన్మించారు. పురాణాల సన్నివేశాలకు అనుగుణంగా గీసిన చిత్రాలు పేరొందాయి. రాధాకృష్ణ, నల దమయంతి, విశ్వామిత్ర మేనక తదితర పాత్రల కళాఖండాలు ప్రసిద్ధి చెందాయి. మహాత్మాగాంధీ, స్వామి వివేకానందల భారీ చిత్తరువులు ప్రస్తుతం ముంబైలోని కౌన్సిల్ హాల్‌లో ఉన్నాయి. లండన్‌లోని రాయల్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్‌కు ఎంపికై ప్రదర్శనలు ఇచ్చారు. రాజ్యోత్సవ, గౌరవ డాక్టరేట్ సహా పలు అవార్డులు పొందారు. 1993 మార్చి 30న కన్నుమూశారు. కొన్ని ప్రముఖ కళాఖండాలు గుల్బర్గాలోని గ్యాలరీలో అందుబాటులో ఉన్నాయి.

ఫారూక్ షేక్ (జయంతి)



ప్రముఖ హిందీ నటుడు ఫారూక్ షేక్ 1948 మార్చి 25న గుజరాత్ రాష్ట్రం వడోదరలో జన్మించారు. బుల్లితెర వ్యాఖ్యాత, మానవతావాదిగా గుర్తింపు పొందారు. సత్యజిత్ రే, హృషికేశ్ ముఖర్జీ, కేతాన్ మెహతా వంటి దర్శకులతో పనిచేశారు. మూస సినిమాలను పక్కనపెట్టి కొత్త తరహా సినిమాలకోసం నాంది పలికి విజయం సాధించారు. బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా 2010లో నేషనల్ ఫిల్మ్ అవార్డ్ అందుకున్నారు. సినీరంగంలో 1977-89ల మధ్య తనదైన ముద్రను చాటారు. 2013 డిసెంబరు 28న కన్నుమూశారు.

సుబ్బరామన్ విజయలక్ష్మి (పుట్టినరోజు)



చదరంగంలో అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన సుబ్బరామన్ విజయలక్ష్మి 1979 మార్చి 25న మద్రాస్‌లో జన్మించారు. ఇంటర్నేషనల్ మాస్టర్, ఉమన్ గ్రాండ్ మాస్టర్, ఫైడ్ టైటిల్స్ పొందారు. చెస్ ఒలింపియాడ్‌లో ఈ టైటిల్ సాధించిన తొలి మహిళగా గుర్తింపు పొందారు. 2001లో 'అర్జున' అవార్డు సాధించారు. అన్ని వయస్సుల విభాగాలలో పోటీ పడి ఇంటర్నేషనల్ మాస్టర్‌గా గుర్తింపు పొందారు. 2016లో 8వ చెన్నై ఓపెన్‌లో రష్యన్ గ్రాండ్ మాస్టర్ బోరిస్ గ్రచేవ్‌తో తలపడి టైగా నిలిచారు. కాగా ఇండియన్ గ్రాండ్ మాస్టర్ శ్రీరామ్ ఝాను పెళ్లి చేసుకున్నారు.

నంది కొండలకు రోప్‌వే ప్రమాదకరం

» పర్యావరణ నిపుణుడు డాక్టర్ ఎల్లప్పరెడ్డి

బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జీవవైవిధ్యం మనుగడ, ఐదు నదులు జన్మించే నంది కొండలలో అపారమైన జలవనరులతోపాటు వన్య సంపద కల్గిన చోట రోప్‌వే నిర్మాణం ప్రమాదకరమని పర్యావరణ నిపుణుడు డాక్టర్ ఎల్లప్పరెడ్డి అభిప్రాయపడ్డారు. విశ్వమానవ హక్కుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరసనకు సిద్ధమయ్యారు. భావితరాలకోసం నంది కొండలను రక్షించాలనే నినాదంతో పోస్టర్‌ను విడుదల చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో అమెరికాలోని గివ్ లైఫ్ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది బరాట్ ఎస్ ఫిషర్, హెచ్2 పోరాటనాయకురాలు డాక్టర్ సంజనాజాన్, మంజునాథహెగ్డే, రేణుకాప్రసాద్, సుప్రీంకోర్టు న్యాయవాది మంజునాథ్ మాద్యాల తదితరులు మీడియాతో మాట్లాడారు. రోప్‌వే నిర్మాణం చేపడితే 150 అడుగుల కొండ ప్రదేశాన్ని తొలగించాల్సి ఉంటుందన్నారు. తద్వారా నంది కొండలకు తీరని ప్రమాదం ఏర్పడనుందన్నారు. శతాబ్దాలకాలంగా దేశ విదేశీయులు ఆహ్లాదకరంగా భావించే నందికొండలను ప్రమాదంలోకి నెట్టరాదన్నారు. శాసనసభ సమావేశాలలో నంది కొండలపై చర్చ జరగలేదన్నారు. బెంగళూరుకు రెండో విమానాశ్రయం అవసరం లేదన్నారు. వేలాది ఎకరాల పంట పొలాలు, చెట్లను తొలగించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న విమానాశ్రయం సరిపోతుందన్నారు. రాజకీయనాయకులు అర్థం చేసుకోవాలన్నారు. జలమూలాలకు భంగం వాటిల్లితే భవిష్యత్తులో పెను ప్రమాదం ఉంటుందన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎల్లప్పరెడ్డి తదితరులు

రైతు సంఘానికి మద్దతు పెరగాలి



కేపీఆర్ఎస్ సంఘం పదాధికారులు

బాగేపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా సాగుతున్న రైతుల సమస్యలపై పోరాటం చేస్తున్న రైతుసంఘానికి మద్దతు పెరిగేలా సభ్యత్వ నమోదు చేపట్టామని రైతు నాయకుడు చన్నరాయప్ప తెలిపారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కర్ణాటక ప్రాంత రైతు సంఘం (కేపీఆర్ఎస్) సభ్యత్వ నమోదు చేపట్టి మాట్లా డారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారని వారికి అండగా రైతు సంఘం నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. కాగా రైతులు పండించే పంటలకు కనీస ధర లభించేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని, స్వామినాథన్ కమిషన్ నివేదిక అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూములకోసం రైతులు అర్జీలు చేసుకుంటే సానుకూలంగా స్పందించి కేటాయించాలని కోరారు. కాగా బాగేపల్లి తాలూకా గూళూరు హోబళి తిమ్మంపల్లి, గోర్తపల్లి, నల్లపరెడ్డిపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే భూకబ్జాలకు పాల్పడారనే ఆరోపణలు విని పిస్తున్నాయని, ఇలాగైతే సామాన్యులకు న్యాయం ఎలా దక్కుతుందని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మండలి సభ్యుడు మునివెంకటప్ప మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులను సంపూర్ణంగా నిర్లక్ష్యం చేశాయన్నారు. గతంలో కేపీఆర్ఎస్ నేతృత్వంలో 63 రోజుల నిరవధిక పోరాటం ఫలితంగా చిత్రావతి డ్యాం సాధ్యమైందన్నారు. ఇలా సంఘాలు మరింత బలోపేతం కావాలంటే సభ్యత్వ నమోదు పెరగాలని, ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. సీపీఎం నాయకుడు మునిస్వామి, సీపీఎం తాలూకా కార్యదర్శి రఘురామరెడ్డి, దేవికుంట శ్రీనివాస్, బిళ్ళూరు నాగరాజ్, లక్ష్మణరెడ్డి, కూలింపల్లి చలపతి, వాల్మీకి అశ్వత్థప్ప, రామాంజి, వెంకటరామప్ప, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపుతో రోగికి ఆక్సిజన్

» కలబురగి మెడికల్ కళాశాల ఆసుపత్రిలో విద్యుత్‌కోత ప్రభావం

బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కలబురగి మెడికల్ కళాశాల ఆసుపత్రిలో విద్యుత్‌కోతతో రోగులు తల్లడిల్లారు. ఆసుపత్రి మెయిన్ సర్క్యూట్‌లో పవర్‌కట్ జరిగింది. ఆక్సిజన్ లభించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి బంధువులు బెంబేలెత్తారు. శనివారం సాయంత్రం సంఘటన చోటు చేసుకుంది. శ్వాసకోశ సమస్యలతో బాధపడుతూ ఐసీయూలో ఉన్న రోగులు ఇబ్బంది పడ్డారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, రోగుల బంధువులు చేతి పంప్‌లతో ఆక్సిజన్‌ను సమకూర్చారు. విద్యుత్‌కోత ఏర్పడ్డంతోనే వైద్యసిబ్బంది సీనియర్ వైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. సాంకేతిక సిబ్బంది పర్యవేక్షణ జరిపారు. యూపీఎస్ బ్యాటరీ బ్యాకప్ లేదు. రోగుల బంధువులు ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయపడ్డారు. వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్ ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత జిల్లాలోనే సమస్య ఏర్పడింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. అదే రోజున ఉదయం మంత్రి శరణప్రకాశ్ పాటిల్ ఆసుపత్రిని సందర్శించారు. సాయంత్రం సంఘటనతో బెంబేలెత్తారు.



చేతి పంప్‌తో ఆక్సిజన్ అందిస్తున్న తీరు ఇలా...

మహిళల్లో నైపుణ్యం పెరగాలి

» ఐఏడబ్ల్యూ సదస్సులో అభిప్రాయం

బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మహిళల్లో నైపుణ్యం పెరగాలని అప్పుడే సొంతంగా ఏదైనా సాధిస్తామనే నమ్మకం పెరుగుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఇంటర్నేషనల్ ఏరోస్పేస్ ఉమెన్స్ (ఐఏడబ్ల్యూ) అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. 70మంది వివిధ అనుబంధ పరిశ్రమల ముఖ్యులు పాల్గొన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యత స్థానికంగా అందుబాటులో ఉండాలంటే ఉన్నత విద్యావిధానంలో మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. ఇదే సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.



సదస్సులో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

నీటిని వృథా చేయరాదు



సీనియర్ సివిల్ న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాలకు ఉపయోగించే నీరు సహా తాగునీటిని సైతం వృథా చేయరాదని సీనియర్ సివిల్ న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా అభిప్రాయపడ్డారు. తాలూకా న్యాయసేవల సమితి, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కోర్టు ఆవరణలో ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా మొక్కలకు నీరు పోసి మాట్లాడారు. నేలపై మానవాళి సహా పశుపక్ష్యాదులకు నీరు ఎంతో ప్రాణాధారమన్నారు. నీటిని కలుషితం చేయరాదని, భావితరాలకోసం నీటిని వృథా చేయరాదన్నారు. ప్రధాన సివిల్ న్యాయాధికారి జై పూజ మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవాన్ని సంవత్సరానికోసం సాంకేతికంగా ఆచరిస్తున్నామన్నారు. వాస్తవానికి మన జీవనం ఆధారపడిందే నీటిపై అన్నారు. జలవనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం తాలూకా అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి సీజీ భాస్కర్, సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహనకు హాఫ్ మారథాన్

బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై సమాజంలో అవగాహన కల్పించాలని బిడది ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండో ఏడాది నిర్వహించిన హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. రామనగర జిల్లా అధికారి యశ్వంత్ గురుకర్ మారథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత అందరి బాధ్యత అన్నారు. సమాజంలో ఏటా రోడ్డు ప్రమాదాలతో మృతి చెందుతున్నారని, ఆత్రుత, అవగాహన లేకపోవడమే కారణమన్నారు. టయోటా బిడది హాఫ్ మారథాన్ ద్వారా చైతన్యం కలిగించాలనే ఆలోచన సముచితమన్నారు. టయోటా కిర్లోస్కర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుదీప్ దళవితోపాటు పలువురు పాల్గొన్నారు. వెయ్యిమందికిపైగా హాఫ్ మారథాన్‌లో భాగస్వామ్యులయ్యారు.



హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న ప్రజలు

పార్టీ నిర్మాణంలో పదాధికారులు కీలకం

మహదేవపుర, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కార్యకర్తలు ఎంత ముఖ్యమో నిర్వహణకు పదాధికారులు అంతే ముఖ్యమని మాజీ మంత్రి అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. మారతహళ్ళిలోని కల్యాణమండపంలో బీజేపీ హోబళి స్థాయి, వివిధ మోర్చాలకు నూతన పదాధికారులను ప్రకటించారు. ఎమ్మెల్యే మంజుళా లింబావళి నేతృత్వంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్ఆర్ శ్రీధర్ రెడ్డి నూతన పదాధికారులను ప్రకటించి నియామక పత్రాలు అందచేశారు. పట్టణ హోబళి స్థాయి ఉపాధ్యక్షుడిగా ఏఈసీఎస్ లే అవుట్ వార్డు ముఖ్యుడు జి జయదేవరాజు, కొడతి వార్డు అధ్యక్షుడిగా కాచమారనహళ్ళి సతీశ్‌రెడ్డి, దొడ్డనెక్కుంది వార్డు అధ్యక్షుడిగా శ్రీనాథ్‌రెడ్డి, స్లం మోర్చా ప్రధాన కార్యదర్శి బసవరాజు, వివిధ మోర్చాల అధ్యక్ష, పదా ధికారులను ఎంపిక చేసి ప్రకటించారు. పార్టీ బలోపేతానికి అందరి సహకారం ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. నూతన పదాధి కారులు అందరి విశ్వాసంతో ముందుకు సాగాలని, సంయ మనంతో వ్యవహరించాలని సూచించారు. నూతన పదాధికారులు, మోర్చా సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో హోబళి స్థాయి తాజా మాజీ అధ్యక్షుడు మనోహర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పదాధికారులకు నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి



గోవర్ధన్ (ఫైల్)

చింతామణి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గోపసంద్ర వద్ద ఆల్టో కారు, బైక్ ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో బైక్ చోదకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఆనూరు గ్రామపంచాయతీ పరిధిలోని జీ కోడిహళ్ళి నివాసి గోవర్ధన్ (23) మృతి చెందాడు. ఇతను దేవనహళ్ళి కారు సర్వీస్‌గ్యారేజ్‌లో పనిచేసేవాడు. కోడిహళ్ళి నుంచి దేవనహళ్ళికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కారు చింతామణి నుంచి శ్రీనివాసపురవైపు వెళ్తుండగా బైక్ ఢీ కొనడంతో తలకు తీవ్రమైన గాయాలై దుర్మరణం చెందాడు. గోవర్ధన్‌కు ఏడాదిక్రితం వివాహమైనట్టు తెలుస్తోంది. ప్రమా దానికి కారణమైన కారు డ్రైవర్ అక్కడనుంచి పరారయ్యాడు. చింతామణి రూరల్ పోలీసులు కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ప్రోత్సాహక ధనం పెంచాలని ఆశాల ఆందోళన

రాయచూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామి మేరకు ఆశా కార్యకర్తలకు ఇచ్చే ప్రోత్సమ ధనాన్ని పెంచాలని సంయుక్త కర్ణాటక ఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు కే ఈరమ్మ డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్ల సాధన కోసం ఆశా కార్యకర్తలు సోమవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రస్తుతం శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనే విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.



నగరంలో ర్యాలీగా వెళ్తున్న ఆశా కార్యకర్తలు

క్షయ నిర్మూలనపై ర్యాలీ

రాయచూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయ రోగ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. డీహెచ్ఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డీహెచ్ఓ డా.వై.సురేంద్ర బాబు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన డీహెచ్ఓ డా.వై.సురేంద్ర బాబు, రోగం ప్రబలకుండా జిల్లా వ్యాప్తంగా ముందస్తు చర్యలు చేపడతామని ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖ తరపున ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగిన ర్యాలీలో జిల్లా క్షయ రోగ నిర్మూలనాధికారి డా.శాకీర్, డాక్టర్ గణేశ్, డా.యశోదా పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీహెచ్ఓ సురేంద్ర బాబు

నిత్యావసర కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న మౌల షరీఫ్

బాగేపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా స్థితిమంతులైనవారు సమాజసేవ ద్వారా పేదలకు చేతనైన సాయం అందించి సమాజానికి తమవంతు చేయూత ఇవ్వాలని సమాజసేవకుడు, న్యాయవాది డాక్టర్ సీకే మౌల షరీఫ్ అభిప్రాయపడ్డారు. డాక్టర్ సీకే మౌల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది, రంజాన్‌లను పురస్కరించుకుని తాలూకాలోని జూలపాళ్య గ్రామంలో నిత్యావసర కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా పండుగల వేళ ఫౌండేషన్ ద్వారా తమవంతుగా కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా రైతులు, కూలి కార్మికులే అధికమని పిల్లల విద్యాభ్యాసానికి సైతం ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాంటి తరుణంలో పండుగలు చేసుకోవడం కూడా కష్టమన్నారు. అందుకే తమవంతుగా పండుగలకోసం కిట్లు ఇస్తున్నామన్నారు. జూలపాళ్య గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు సీకే మహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్రతో విద్యార్థుల భోజనంపై ఒప్పందం



ఒప్పందంలో ఇరుసంస్థల ప్రతినిధులు

బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అక్షయపాత్ర ఫౌండేషన్‌తో శ్రీరామ్ ప్రాపర్టీస్ కీలక ఒప్పందం చేసుకుంది. 2.63 లక్షలమంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సమకూర్చేందుకు ఒప్పందం చేసుకున్నట్టు శ్రీరామ్ ప్రాపర్టీస్ సీఎండీ మురళీ మళయప్పన్ తెలిపారు. తమ సంస్థ సొంతింటి కల సాకారం చేయడమే కాక సామాజిక సేవలో భాగస్వాములు కావాలనే ఒప్పందం చేసుకున్నామన్నారు. అక్షయపాత్ర మార్కెటింగ్ అధికారి ధనంజయ్ గంజు మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమకూర్చాలనేది అక్షయపాత్ర ఆశయమన్నారు.

'నారాయణ'లో మడమ మార్పిడి చికిత్స


బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నారాయణ ఆసుపత్రిలో తొలిసారి (యాంకిల్ రీప్లేస్‌మెంట్) మడమ మార్పిడి చికిత్స జరిపారు. ప్రముఖ సర్జన్ డాక్టర్ శేఖర్ ముద్రామయ్య సోమవారం మీడియాతో మాట్లాడారు. మడమ నొప్పి, సంధివాతంతో కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్న 64ఏళ్ల మహిళకు సంపూర్ణంగా మడమ మార్పిడి చికిత్సను చేశామన్నారు. ప్రస్తుతం ఆమె సంపూర్ణంగా కోలుకున్నారన్నారు. దేశంలో ఆపరేషన్ నిర్వహించడం ఇంకా సవాళ్లుగానే ఉన్నాయన్నారు. అవసరమైన ఇంప్లాంట్‌లు స్థానికంగా అందుబాటులో లేవని, మెడికల్ కంట్రోల్ అథారిటీ అనుమతులు పొంది అమెరికా, నెదర్లాండ్స్ వంటి దేశాలనుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉందన్నారు. ఆపరేషన్ చేయించుకున్న మహిళ ఒకరోజులోనే సహాయంతో నడవడం ప్రారంభించారని, రెండు వారాలలో సంపూర్ణంగా గాయం నయమైందని, ఆరు వారాలలో ఆమె సాధారణంగా నడక కొనసాగిస్తున్నారన్నారు. నొప్పి నివారణకు వైద్యుల సలహాలతో చికిత్సలు పొందడం సమంజసమన్నారు.

ఎమ్మెల్యేల సస్పెన్షన్ రాజ్యాంగ విరుద్ధం: బీజేపీ



నిరసనలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరన్నగౌడ

రాయచూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శాసనసభ నుంచి ప్రతిపక్ష పార్టీకి చెందిన 18 మంది శాసన సభ్యులను ఆరు నెలల పాటు సభ నుంచి సస్పెండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని అనైతికమని బీజేపీ జిల్లాధ్యక్షుడు వీరన్నగౌడ అన్నారు. ఎమ్మెల్యే సస్పెన్షన్‌ను నిరశిస్తు బీజేపీ నాయకులు సోమవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇదే సమయంలో మైనార్టీల కాంట్రాక్టకు సంబంధించి రిజర్వేషన్‌ను తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు బీజేపీ జిల్లాధ్యక్షుడు వీరనగౌడ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన వీరనగౌడ, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో మతపరమైన రిజర్వేషన్‌లకు తావు లేదని కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానం పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ తన పూర్వపు వైఖరినే కొనసాగుతుందన్నారు. ఉద్దేశపూర్వకంగా మతపరమైన రిజర్వేషన్‌లు కల్పిస్తు ప్రజల మధ్య గందరగోళాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుండడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే ఆరు నెలల సస్పెన్షన్ పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమన్నారు. ఈ విషయంలో స్పీకర్ తన నిర్ణయాన్ని పున: పరిశీలించి సస్పెండ్‌ను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1595.59	1,581.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,244	844
నీటి నిల్వ (టీఎంసీలు)	16.34	5.40

'జెన్నీ మిల్క్' కేసులో మరో నిందితుడి అరెస్టు



అరెస్టయిన అంజినప్ప

బళ్లారి సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేసి గాడిదలను ఇచ్చి పాలు కొనుగోలు చేసిన జెన్నీ మిల్క్ కేసులో మరో నిందితుడిని సీఐడీ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నిందితుడు హొసపేట తాలూకాలోని గాళెమ్మన గుడి నివాసి అంజినప్ప. ఐదు నెలలుగా అతను పరారీలో ఉన్నాడు. గాళెమ్మన గుడిసె దగ్గర అంజినప్ప ఒక షెడ్ నిర్మించి గాడిదలను మేపి రైతులకు అప్పగించేవాడు. సీఐడీ కలుబురగి డివిజన్‌కు చెందిన డీఎస్పీ అస్లాం పాషా నేతృత్వంలో దర్యాప్తు జరుగుతోంది. రైతులను రూ.13కోట్లకు పైగా మోసం చేశారనే ఆరోపణలపై కంపెనీ ఎండీత నూతలపాటి మురళి, కంపెనీ మేనేజర్ ఉమా శంకర్ రెడ్డి, సూపర్‌వైజర్స్ సయ్యద్ మహ్మద్‌గౌస్, హర్షవర్ధన్‌రాజు, గుర్రం యోగానందరెడ్డిని ఇది వరకే అరెస్ట్ చేశారు.

కుమారస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో కుమారస్వామి

బళ్లారి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇన్‌ఫ్రంట్ రోడ్డు ఫైర్ ఆఫీసు సమీపంలో ఉన్న కుమారస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



చెల్లాచెదురైన జొన్నల సంచులు

బళ్లారి రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జొన్నల ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో జొన్నలు చెల్లాచెదురుగా పడిపోయాయి. బళ్లారిరూరల్ పరిధిలోని హగరి ఆర్టీవో చెక్ పోస్టు చాగనూరు వదకద సోమవారం బళ్లారి ఏపీఎంసీ మార్కెట్ పలువురు రైతులు దాదాపుగా 80 సంచుల వరకు జొన్నల మూటలను తరలిస్తున్నారు. ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసిన లారీ ముందు వెళ్లే సమయంలో ఇంజన్‌ను బలంగా ఢీకొట్టింది. ట్రాక్టర్ బోల్తా పడి జొన్నలు చెల్లాచెదురయ్యాయి. ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న రైతులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు సహకరించాలి

● మెరుగైన చికిత్సతో వ్యాధి నయం ● గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలి: ఎమ్మెల్యే అన్నపూర్ణ

బళ్లారి సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాను క్షయ రహితజిల్లాగా మార్చేందుకు అందరూ చేతులు కలపాలని సండూరు ఎమ్మెల్యే ఇ.అన్నపూర్ణ తుకారం అన్నారు. ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవంలో భాగంగా క్షయవ్యాధిని అంతం చేయగలం అనే నినాదంతో సోమవారం నగరంలోని బిమ్స్ వైద్య భవన్ ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ , జిల్లాఆరోగ్య, కుటుంబ సంక్షేమం, జిల్లా క్షయ నిర్మూలన కేంద్రం నిర్వహించిన 2024కార్యక్రమం కింద అద్భుతమైన సేవలందించిన అధికారులు, సిబ్బందికి సన్మాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరినీ ప్రభావితం చేసే వ్యాధి క్షయ వ్యాధేనన్నారు. దుమ్ము,ధూళి ఉన్న ప్రాంతాల్లో పనిచేసే వారిని రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిని కూడా ఇది ప్రభావితం చేస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు క్షయవ్యాధి గురించి పెద్దగా పట్టించుకోరని, ఈదశలో తగిన అవగాహన కల్పించాలన్నారు. అదనంగా క్షయవ్యాధిని సకాలంలో గుర్తించడంలో వైద్య అధికారులు సహా ఆశా కార్యకర్తల పాత్ర ముఖ్యమైనది, అందువల్ల బళ్లారి క్షయ రహితంగా మార్చడంలో మనమందరం చేతులు కలపాలిన ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. మంచి ఆరోగ్య సంరక్షణ అందించడం మన ప్రభుత్వ కర్తవ్యం అన్నారు.

బళ్లారి మహానగర పాలక సంస్థ మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ గతంలో క్షయవ్యాధి గణనీయమైన ప్రభావాన్ని చూపిందన్నారు. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక యంత్రాలు అందుబాటులో ఉన్నాయని దీని వల్ల సకాలంలో గుర్తింపు సత్వర చికిత్స లభిస్తాయన్నారు. జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహమ్మద్ హారీస్ సుమైర్ మాట్లాడుతూ.. జిల్లాలో క్షయవ్యాధి కేసులు గణనీయంగా తగ్గాయని, దీనిని పూర్తిగా తగ్గించడానికి ప్రజలు ఆరోగ్య శాఖతో చేతులు కలపాలని ఆయన అన్నారు. క్షయవ్యాధి లక్షణాలను గమనించినట్లయితే వెంటనే పరీక్ష కోసం సమీపంలోని ఆసుపత్రిని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ

సందర్శించాలి, తర్వాత చికిత్స పొందడం సలభం అవుతుందని అన్నారు. జిల్లా క్షయ నిర్మూలన అధికారిణి డాక్టర్ ఇంద్రాణి ప్రారంభోపన్యాసం చేస్తూ క్షయవ్యాధిని త్వరగా గుర్తించడానికివ బిమ్స్ జిల్లా ఆసుపత్రులు, తాలూకా స్థాయి ఆసుపత్రుల్లో సిబినాట్ యంత్రాలను ఇప్పటికే అమలు చేసినట్లు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో ట్రూనాట్ మిషన్లను అమలు చేశామని అన్నారు. ఇది వ్యాధిని ముందస్తూగా గుర్తించడం, చికిత్స చేయడంలో సహాయపడుతుంది. నివారణ రేటు 85శాతం గణనీయమైన విజయాలు సాధించిన జిల్లాలో బళ్లారి జిల్లా ఒకటిగా నిలిచింది. క్షయరహిత గ్రామ పంచాయితీల బళ్లారి తాలూకాలోని భైరవదేవహళ్ళి, యర్రగుడి సంగనకల్లు అధ్యక్షులను ఆ ప్రాంత వైద్యులను సత్కరించారు.

ఈసందర్భంగా మహానగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ సుకుమ్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి డా.రమేశ్‌బాబు, జిల్లాసర్జన్ బసారెడ్డి, బిమ్స్ డైరెక్టర్ గంగాధర్‌గౌడ, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర దాసప్పనవర్, సూపర్‌వైజర్ గిరీశ్, వివిధ తాలూకా ఆరోగ్య అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, టీబీ విభాగం సిబ్బంది, బిమ్స్ శిక్షణ వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు ఇతరులుపాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు దేవన్న

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

● కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవన్న డిమాండ్

బళ్లారి సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు నిరక్షరాస్యులు, నిర్మాణ పనుల్లో తక్కువ వేతనాలకు పగలు, రాత్రి నిరంతరం పనిచేస్తున్నారని వారికి సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.దేవన్న డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్ర భవన నిర్మాణ ఇతర కార్మికుల సంఘం అదివారం తాలూకాలోని పాతదరోజీ గ్రామంలో నిర్వహించిన కార్మికుల యూనిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సౌకర్యాలు లేకుండా వారు నిరంతరం దోపిడీకి గురవుతున్నారన్నారు. వారి మెరుగైన జీవితం కోసం రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. కార్మికులు ఎటువంటి భద్రతా పరికరాలు లేకండా తక్కువ వేతనాలకు ఎక్కువ గంటలు పనిచేస్తున్నారని, వారి జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. కార్మికులకు పెన్షన్, ప్రసూతీ, అంత్యక్రియల ఖర్చులు, విద్య, ఆరోగ్య ప్రయోజనాలను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు శేకన్న, నూతన గ్రామ యూనిట్ అధ్యక్షుడు వీటీ తిమ్మప్ప, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి వి.దేవన్న, సభ్యులు రాము, మల్లికార్జున, కార్మికులు పాల్గొన్నారు.

మిరప రైతుల నిరసన



తహసీల్దార్ నర్సప్పకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కంప్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శరణప్ప దొడ్డమని డిమాండ్ చేశారు. సోమవారం కురుగోడు పట్టణంలో మెరుపు రాశులతో నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ రబీ పంటలకు ఏప్రిల్ 20 వరకు కాలువలకు నీరు విడుదల చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ నర్సప్పకు మనవిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తాలుకా అధ్యక్షులు షాపూర్ గురు రుద్రప్ప కురుగోడు యూనిట్ అధ్యక్షులు, కమ్మరి షేక్ యూనిట్ వైస్ ప్రెసిడెంట్, గులేవు దొడ్డ లింగప్ప తాలుకా ఉపాధ్యక్షులు మంజునాథ గౌడ, సభ్యులు మరివేషప్ప పుర్గై, దర్గా పాండురంగ, గులేవ్, శివరాజా, గొరవర మంజు, గిడ్డబసప్ప, సిద్దప్ప, గౌరవాధ్యక్షులు కరిబద్రి కరెన్న, గోరూరు గాదిలింగప్ప, చంద్రప్ప, బసవన్న, చిదానంద, గంగన్న, గోవిందప్ప, లోకేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు అందిస్తున్న ఎస్ఎల్ఆర్ ప్రతినిధులు

విజయనగరం (హోస్పేట), మార్చి 24(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిశుభ్రంగా వుంచుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఎస్ఎల్ఆర్ మెటాలిక్స్ కంపెనీ సీఎస్ఆర్ విభాగం అధిపతి మల్లికార్జున అన్నారు. హోస్పేట తాలుకాలోని మరియమ్మనహళ్లి పట్టణంలో పట్టణ పంచాయతీ సభ్యులు, ఎస్ఎల్ఆర్ మెటాలిక్స్ కంపెనీ సహకారంతో నిర్వహించిన స్వచ్ఛతా డ్రైవ్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. పంచాయతీ అధ్యక్షులు ఆదిమని హుస్సేన్ బాషా మాట్లాడుతూ మెటాలిక్స్ కంపెనీ పట్టణ అభివృద్ధి, శ్రేయస్సు కోసం అనేక గ్రాంట్లను అందించిందన్నారు. పట్టణ జాతర సందర్భంగా శుభ్రపరచడం కోసం నాలుగు జేసీబీలు, ట్రాక్టర్లను విరాళంగా ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీపీ ఉపాధ్యక్షురాలు, లక్ష్మీమంజునాథ్, పీపీ సభ్యులు, సురేష్, మైలారి, పంపాపతి పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నందీష్

బళ్లారిరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్రహణం రోడ్లో షిర్డీ సాయిసేవా సత్సంగ్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని బళ్లారి మహా నగరపాలిక మేయర్ నందీష్, ముండ్లూరు ప్రభంజన్‌కుమార్, ఎస్ గోవింద రాజులు, సేవా సత్సంగ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ గోపాలకృష్ణ ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నందువల్ల మజ్జిగ, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

అచ్చొళ్లి గ్రామంలో...

సిరుగుప్ప, (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహాన్ని తీర్చేందుకు వేసవి కాలంలో చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అచ్చొళ్లి గ్రామం ఆరాధ్య గురువులు ముత్తిన పెండే శివకుమారస్వామి తెలిపారు. సోమవారం తాలుకాలోని అచ్చొళ్లి గ్రామంలో జిల్లా పరిషత్ పంచాయతీరాజ్ శాఖ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిరుగుప్ప తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి దమ్మూరు బసవరాజు, అచ్చొళ్లి ఎస్‌వి కుమారస్వామి, ప్రభుత్వాస్పత్రి ఉద్యోగులు లింగరాజరెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీలను బుజ్జగించడానికే సీఎం ప్రయత్నాలు: బీజేపీ

బళ్లారి సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి విషయంలోనూ ముస్లీం సమాజాన్ని బుజ్జగించడానికే ప్రయత్నిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు ఆరోపించారు. సోమవారం నగరంలోని రాయల్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసిన తర్వాత మాట్లాడిన ఆయన శాసనసభలో 18మంది బీజేపీ ఎమ్మెల్యేలలను స్పీకర్ 6నెలల పాటు సస్పెండ్ చేయడం చట్ట విరుద్ధమని, స్పీకర్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ మరోసారి తన పాత బుజ్జగింపు అలవాటును కొనసాగిస్తోందని, ముస్లీంలకు రిజర్వేషన్లు విదేశీ చదువులకు లక్షలు కేటాయించడం తగదన్నారు. గత మూడేళ్లలో దాదాపు రూ.3కోట్ల డబ్బు ఇతర ప్రయోజనాలకోసం మళ్లించారన్నారు. ముస్లింలకు కాంట్రాక్ట్ పనుల్లో రిజర్వేషన్ ఇవ్వడం తగదన్నారు. అనంతరం సీఎం సిద్దరామయ్య దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివాకర్, హనుమంతప్ప, రైతు మోర్చా గురిలింగనగౌడ, మహిళా యూనిట్ సభ్యులు సుగుణ, ఓబలేశ్, బుడా అధ్యక్షుడు మారుతీప్రసాద్, మహిపాల్, బసలింగనగౌ, రాణితోట వీరేశ్, నారాయణస్వామి, సోమనగౌడ, మల్లేశ్, విరూపాక్షి, వందలాది మంది ఇతరులు పాల్గొన్నారు.



గడిగి చెన్నప్ప సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

జయంతులపై సన్నాహక సమావేశం

బళ్లారి సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం దేవర దాసీమయ్య, భగవాన్ జయంతి కార్యక్రమాలను అర్థవంతంగా జరుపుకుటుందని అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్‌జుబేర్ అన్నారు. సోమవారం నగరంలోని జిల్లాలెక్టర్ కార్యాలయ హాల్లో జరిగిన మహనీయుల జయంతి సన్నాహక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2న నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని కన్నడ సంస్కృతిక శాఖ కల్చరల్ కాంప్లెక్స్ హాల్లో దేవరదాసీమయ్య జయంతి కార్యక్రమాన్ని అర్థవంతంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తామని, ఏప్రిల్ 10న నగరంలోని తేరువీది రోడ్డులోని మహావీర్ జైన దేవాలయం హాల్లో భగవాన్ మహావీర్ జయంతి కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. జయంతి కార్యక్రమాల్లో జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.


అక్రెడిటేషన్‌పై వర్క్‌షాపు

విజయనగరం (హోస్పేట), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆన్ ఐక్యూఏసీ అక్రెడిటేషన్ ప్రక్రియపై ఒక రోజు వర్క్‌షాపును నేషనల్ బోర్డ్ ఫర్ అక్రెడిటేషన్ సోమవారం నిర్వహించింది. రీసోర్స్ పర్సన్లలో బెంగళూరులోని విజయ విఠల ఇంజనీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రఘుకుమార్ ఉన్నారు. అక్రెడిటేషన్ ప్రక్రియపై ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ, ఇతర రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లను పొందడానికి ఇంజనీరింగ్ కళాశాల అన్ని విభాగాలు న్యూఢిల్లీలోని నేషనల్ అక్రెడిటేషన్ బోర్డు నుండి అక్రెడిటేషన్ పొందడం తప్పనిసరి అని వివరణాత్మకంగా ఉపన్యాసం ఇచ్చారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన

బళ్లారిరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మోకా సముదాయ ఆరోగ్య కేంద్రం ఆవరణంలో అంతర్జాతీయ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం డాక్టర్ భారతి మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ.జ నోటిని శుభ్రంగా ఉంచుకుంటే పలు రోగాలు దూరమవుతాయన్నారు. నోటి క్యాన్సర్ ప్రబలుతున్న సమయంలో గుట్కా, ధూమపానాలకు దూరంగా ఉండాలన్నారు. దంత వైద్యులు రూప మాట్లాడుతూ పళ్లను రోజుకు రెండు సార్లు శుభ్రం చేసుకోవాలని, స్వీట్లు తిన్న వెంటనే నోరు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డెంటల్ డాక్టర్ మునిసా, డాక్టర్ రూప, హెల్త్ ఆఫీసర్ బసవరాజు హాస్పిటల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, హెల్త్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

రామప్పకు అవార్డు ప్రదానం



అవార్డుతో సత్కరిస్తున్న విశ్వాస్ ఫౌండేషన్ సభ్యులు

కంప్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రత్న పునీత్ రాజ్‌కుమార్ 51వ జయంతి సందర్భంగా ధార్వాడలోని రంగాయణ సువర్ణ సముదాయ భవన్‌లో విశ్వాస్ ఫౌండేషన్ వివిధ రంగాలలో రాణించిన వారికి అవార్డులు అందించారు. ఎమ్మిగనూరు గ్రామంలోని ప్రభుత్వ సెంటెనరీ స్కూలు ఉపాధ్యాయులు రామప్పకు పునీత్ రాజ్‌కుమార్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా హుబ్బళ్లి మహాదేవప్ప, వీణా హొసమని, సాహిత్య ఉపాధ్యాయురాలు పండిట్ ఆవాజీ విశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.

27న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

విజయనగరం(హోస్పేట), మార్చి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం మార్చి 27న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో రూపేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించబడుతుందని కమిషనర్ మనోహర్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆమోదించనున్నారు. ప్రజలు హాజరై తమ సూచనలు, సలహాలు అందించి విజయవంతం చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

హోసూరు జోన్



ప్రజల సమస్యలు వింటున్న మేయర్ సత్య

వార్డుల్లో మేయర్ పర్యటన

హోసూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని 28వ వార్డులో కార్పొరేషన్ మేయర్ సత్య పర్యటించారు. చెన్నత్తూరు, హనీహోంలను సందర్శించారు. చెన్నత్తూరు కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 150మంది విద్యార్థులు చదువుతున్నారు. పాతభవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ నేపథ్యంలో రూ.35లక్షలతో రెండు కొత్త తరగతి గదులను నిర్మించాలని నిర్ణయించారు. సాధ్యమైనంత త్వరగా నూతన తరగతి గదులు నిర్మాణ పనులు చేపట్టాలని మేయర్ సూచించారు. మేయర్ వెంట అసిస్టెంట్ ఇంజనీర్, సాంకేతిక సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెరగాలి

హోసూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంచేందుకు ఎన్ఎస్ఎస్ శిబిరం దోహదపడుతుందని ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దినేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. అదియమాన్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే ప్రత్యేక శిబిరం మడకొండపల్లిలో జరిగింది. పర్యావరణ అవగాహన సమాజసేవను ప్రోత్సహించేలా కార్యక్రమాలు సాగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారత్నం అధ్యక్షత వహించారు. సీఎంసీఏ ప్రోగామ్ ఆఫీసర్ మత్తప్పన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎంసీఏ అసిస్టెంట్ మేనేజర్ డేవిడ్ భాగ్యసుందరం ప్రధాన ప్రసంగం చేశారు. సుస్థిర ఆచరణల ప్రాముఖ్యత గురించి, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో యువత పాత్ర గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో సీఎంసీఏ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ భవాని రమేశ్ నేతృత్వంలో మొక్క లు నాటారు. విద్యార్థులతోపాటు స్థానికులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై ప్రకాశ్

ఉత్సాహంగా ఎడ్ల పందేలు

హోసూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బేరికై ప్రాంతంలో ఎడ్లపందేలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను ఎమ్మెల్యే వై ప్రకాశ్ లాంఛనంగా ప్రారంభించారు. శూలగిరి, బేరికై, బాగలూరు, అత్తిముగం తదితర ప్రాంతాలనుంచి 300కుపైగా అలంకరించిన ఎద్దులు పాల్గొన్నాయి. ఎడ్లను గేటుగుండా వదలడంతో మైదానంవైపు పరుగులు తీశాయి. యువకులు, గోరక్షకులు ఎద్దులను వెంబడించాయి. వాటి కొమ్ములకు కట్టిన బహుమతులు, అలంకరణ వస్తువులను లాగేందుకు ప్రయత్నించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు కల్పించారు. శూలగిరి నార్త్ యూనియన్ కార్యదర్శి నగేశ్, లోకేశ్‌రెడ్డి, ఉపకార్యదర్శి కృష్ణన్, రామచంద్రన్, డీఎంకే ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బేడరపల్లి చెరువును శుభ్రం చేయాలని వినతి

హోసూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మూడోవార్డు బేడరపల్లి చెరువును పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు మొత్తం గుర్రపుడెక్క ఆకు ఆక్రమించింది. చెరువు చుట్టూ 50కిపైగా ఫ్యాక్టరీలు ఉన్నాయి. సిప్‌కాట్ మొదటి డివిజన్‌లో ఉన్న ఈ ప్రాంతంలో వివిధ రాష్ట్రాల వాసులు పెద్దసంఖ్యలో ఉన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల ఇళ్లనుంచి, ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలు రావడంతో చెరువు కలుషితం అవుతోంది. గుర్రపుడెక్కను తొలగించడంతోపాటు చెరువు కలుషితం కాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



గుర్రపుడెక్కతో నిండిన బేడరపల్లి చెరువు